కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా 15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 25, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 16, క్యారెట్ 32, దొండ 45, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌లో పోలీస్ క్రికెట్ టోర్నమెంట్

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌లో శుక్రవారం హైదరాబాద్ సిటీ పోలీస్(నార్త్‌జోన్) క్రికెట్ టోర్నమెంట్ జరుగనుంది. నార్త్‌జోన్ పరిధిలోని నాలుగు డివిజన్లలో ఉన్న 11 పోలీస్‌స్టేషన్ల నుంచి నాలుగు టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారు. నాలుగు డివిజన్లకు రెండు మ్యాచ్‌లు జరుగుతాయని, అందులో గెలిచిన రెండు టీమ్‌లు ఫైనల్ ఆడుతాయి. ఒకే రోజు మూడు మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఘనంగా పోచమ్మ మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: అంబానగర్‌లోని పోచమ్మ మైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేటర్ కంది శైలజ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం, బస్తీనాయకులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బస్తీ ఇంఛార్జ్ భాగ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.







సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చిలో క్రిస్మస్ వేడుకల దృశ్యాలు..

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



సనత్‌నగర్: క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలో వీధులన్నీ పండుగ శోభతో అలరారాయి. ఇంటింటా రంగురంగుల స్టార్స్ మెరిశాయి. క్రిస్మస్ ట్రీని బెల్స్, గిఫ్ట్ బాక్స్‌లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం అశేషంగా తరలివచ్చిన క్రిస్టియన్ సోదర సోదరీమణుల నడుమ మత పెద్దలు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

◆ సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా, ఫ్లై ఓవర్ పక్కన గల మెథడిస్ట్ చర్చి, ఎండీ ఇమానుయేల్, సీఎస్ఐ, బాప్టిస్టు, బల్కంపేట్‌లోని యునైటెడ్ ఇండిపెండెంట్, యేబ్రోను చర్చిలతో పాటు సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

◆ పలుచోట్ల క్రీస్తు జనన ఉత్థానాన్ని బొమ్మల రూపేణా తెలియజేసిన తీరు ఆకట్టుకుంది. క్రీస్తు సందేశాన్ని మత పెద్దలు వినిపించారు. ఇక కేక్‌లు, గిఫ్ట్‌లను పరస్పరం కానుకలుగా ఇచ్చిపుచ్చుకున్నారు.

క్రీస్తు జన్మదినం అందరికీ పండుగ రోజు

కంటోన్మెంట్: కరుణామయుడు యేసు క్రీస్తు జన్మదినం జనులందరికీ పండుగ రోజు అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం, మడ్‌ఫోర్ట్ గార్డెన్స్‌లోని లైఫ్ ఛేంజింగ్ రివైవల్ ఛర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు పుట్టిన శుభదినాన జరుపుకునే క్రిస్మస్ వేడుకలలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.. ఈ భూమి మీద ప్రజలను ఉద్ధరించడం కోసం వచ్చిన దేవుడు ఏసు క్రీస్తు అని అన్నారు . ఏసుక్రీస్తు ప్రేమ, దయ, కరుణ సందేశాన్ని ఇచ్చారని ఆయన సందేశాన్ని ప్రచారం చేస్తూ, హోలి బైబిల్ లోని సందేశాన్ని సామాన్యులకు అర్ధమయ్యేలా సువార్తలు చెప్తూ సమాజానికి సేవ చేస్తున్న ఫాదర్లను, పాస్టర్లను ఆయన అభినందించారు. క్రైస్తవ సంస్థలు సమాజానికి చేస్తున్న సేవాకార్యక్రమాలకు, ప్రభుత్వం తరపున అన్నిరకాలుగా సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బౌద్ధనగర్: అంబర్‌నగర్ కట్ట వద్దనున్న బెథనీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ కంది శైలజ ముఖ్యఅతిథిగా హాజరై చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆమె పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు సూక్తులను అనుసరించాలి: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..

ఏసుక్రీస్తు సూక్తులను ప్రతిఒక్కరూ అనుసరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచం మొత్తం ఎంతో గొప్పగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు.

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి హోసన్న పెంతికోస్తు, చిలకలగూడ సీఎస్ఐ వెస్లీ చర్చిల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. హోసన్న పెంతికోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ పాస్టర్ జోయల్‌జ్ఞానరాజ్, జెమీజ్ఞానరాజ్‌ల నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తు జననం, స్తుతి, స్తోత్రం కార్యక్రమాలు చేపట్టారు.

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో క్రిస్మస్ ఘనంగా జరిగాయి. తార్నాకలోని ఐనోన్ చర్చి, బాప్టిస్టు చర్చి, లాలాపేటలోని లోగోస్ గాస్పెల్ చర్చి, ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి, మెథడిస్టు చర్చిలో ఉదయం నుంచే క్రైస్తవుల సందడి నెలకొంది. లాలాపేటలోని లోగోస్ గాస్పెల్ చర్చిలో రెవరెండ్ జి. సుదర్శన్ పాస్టర్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి ముఖ్యతిథిగా పాల్గొన్నారు.






ఎలోహీమ్ హీలింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో..



వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ



మత ప్రబోధం చేస్తున్న పాస్టర్ జోయల్, జెమీజ్ఞానరాజ్

కాలేజీలో అడ్మిషన్.. ఆ తరువాత నేరుగా పరీక్షలకే..



- పలు ప్రైవేటు కళాశాలల్లో అధ్యాపకుల కొరత
- తరగతుల నిర్వహణ నామమాత్రమే
- పట్టించుకోని అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీ పరిధిలోని పలు ప్రభుత్వ కళాశాలలు, ప్రైవేటు కాలేజీల్లో తీవ్రమైన అధ్యాపకుల కొరత ఉంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన వేతనాలు లేకపోవడం వల్ల ప్రైవేటు సంస్థల్లో ఎవరూ చేరడం లేదని తెలుస్తోంది. దీంతో ఓయూ పరిధిలో డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఒక పూట మాత్రమే అదీ నామమాత్రంగా తరగతులు జరుగుతున్నాయి. కొన్ని కాలేజీలు అయితే అసలు తరగతులు నిర్వహించే పరిస్థితుల్లో కూడా లేవు. ఇక ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు నేరుగా పరీక్షలకు హాజరవుతున్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఇతర డిగ్రీ కోర్సులతో పాటు ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం బీఈడీ, ఎంపీఈడీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంబీఏ, ఫార్మసీ తదితర వృత్తి విద్య కోర్సుల కాలేజీల్లో సైతం తరగతులు జరగడం లేదు. గత నెల సీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓయూ పరిధిలోని 21 ఎంసీఏ, ఎంబీఏ ప్రైవేటు కాలేజీలకు ఈ నెల 13 వరకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసి పది రోజులు అవుతున్న కాలేజీల నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఈ విషయాన్ని ఓయూ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా ఓయూ పరిధిలోని వర్సిటీ, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో క్రమం తప్పకుండా క్లాసులు జరిగేలా వీసీ ప్రొ.కుమార్ చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగేశ్వర్‌రావు కోరారు. తరగతులు నిర్వహించకుండా హాజరు వేసి పరీక్షలు రాయిస్తున్న కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పీజీ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సాక్షి సిటీ బ్యూరో: కాలేజీ రోజులను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. నాటి స్నేహమే అన్నింటికన్నా విలువైనది అంటూ నెమరేసుకున్నారు. ఉస్మా నియా యూనివర్సిటీ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కర్మాన్‌ఘాట్‌లోని గ్రాండ్ హవేలీలో సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు జరుపుకున్నారు.అంతా ఒక చోట చేరి, పాతికేళ్ల జీవనంలో వచ్చిన మార్పుచేర్పులను, స్నేహితులతో పంచుకున్నారు. అప్పట్లో ఉస్మానియా హాస్టల్ జీవనంలో స్నేహితుల అండతో గడిచిన రోజులను గుర్తు చేసుకున్నారు. జీవన ప్రయాణంలో సమస్యలు ఎదురైనప్పుడు అండగా నిలిచిన స్నేహపు గొప్పతనాన్ని పంచుకున్నారు. తెలుగు, హిస్టరీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్.. విభాగాలకు చెందిన పూర్వ విద్యార్థులు తెలుగు రాష్ట్రాలలో భిన్న రంగాలలో తాము చేస్తున్న కృషిని అనుభవాలను వివరించారు. అనంతరం విందు వినోదాలతో..ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకుమార్ లను అందరూ అభినందించారు.

మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేసిన పీడీఎస్‌యూ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేశారు. దేశంలో కులాల పుట్టుకకు కారణం మనుస్మృతి అని పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు. నాడు మనువాదులకు వ్యతిరేకంగా అంబేడ్కర్ పోరాడగా నేడు వారి వారసులే పాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని పాలించేందుకు రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం శ్యామ్, కె.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సంతోష్, ఓయూ నేతలు గౌతం, సాయి, మధు, మహేష్, పవన్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ శాస్త్రినగర్‌లోని శ్రీ శివ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం నాగదేవతల, నందీశ్వర పున:ప్రతిష్ఠ, నూతన దీపస్తంభ ప్రతిష్ఠను నిర్వహించనున్నట్లు చింతపల్లి వంశీ రెడ్డి, చింతపల్లి శోభారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేద పండితులతో ప్రత్యేక పూజలతో భక్తుల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి పేర్కొన్నారు.


బీసీల రిజర్వేషన్లు పెంపు హర్షణీయం

లిబర్టీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు కేవలం 20 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు 2024 ఆమోదించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్, మిగితా మంత్రివర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

లిబర్టీ: ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2021 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు పీడిస్తున్నాయని ఫలితంగా విద్య పూర్తయిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజీసీటీఏ ఓయూ కార్యదర్శిగా రాకేష్ భవాని



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) ఉస్మానియా యూనివర్సిటీ సెక్రటరీగా కవి, రచయిత, గాయకులు డాక్టర్ చింతల రాకేష్ భవాని వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఇటీవల డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజేంద్రకుమార్, డాక్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డాక్టర్ చింతల రాకేష్‌భవాని ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఇటీవల 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా పాత పెన్షన్ సాధనకు కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ భవాని మాట్లాడుతూ... ఈ ఎన్నిక తన బాధ్యతను మరింత పెంచిందని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నిస్వార్థ రాజకీయానికి నిదర్శనం వాజ్‌పేయి



దయానంద్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు

సనత్‌నగర్: అంకితభావం, నిస్వార్థ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయి అని పలువురు వక్తలు కొనియాడారు. వాజ్‌పేయ్ శత జయంతి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలుచోట్ల బీజేపీ శ్రేణులు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వాజ్‌పేయ్ లాంటి నేత నేటి రాజకీయ నేతలకు మార్గదర్శకుడని పలువురు నేతలు కీర్తించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎంతో హుందాగా నడుచుకుంటూ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. దేశంలోని గ్రామ గ్రామాన అభివృద్ధి ఫలాలు అందించిన మేధావి వాజ్‌పాయ్ అని కొనియాడారు.

◆ సనత్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు దయానంద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆశా వర్కర్లకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌లతో పాటు రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ, కన్నూరి క్రాంతికుమార్, మూల రవీందర్, లింగంపల్లి నర్సింగరావు, వెల్లాల రామ్మోహన్, కేతినేని సరళ, పురురవరెడ్డి, ఆకుల మహేష్, చంద్రకుమార్, సుమన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



శ్రీ సాయి సప్తాహ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

పద్మారావునగర్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని శ్రీ సాయిబాబా మందిరంలో బుధవారం జరిగిన సాయి సప్తాహ వేడుకల్లో కార్పొరేటర్ చీర సుచిత్ర ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారానే మనిషి అన్ని విధాలా పరిపూర్ణ వ్యక్తిగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఎ.సందీప్, స్వప్న, శ్రీధర్, జయ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా హారతి కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.

వైద్యం పొంది..బిల్లు ఎగ్గొట్టి..

న్యూసెన్స్ చేసిన మహిళపై కేసు

బంజారాహిల్స్: చికిత్స చేయించుకున్న అనంతరం బిల్లు చెల్లించాలని అడిగిన ఓ క్లినిక్‌లో మహిళ దౌర్జన్యం చేసి అద్దాలు ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–1లోని సీవీఆర్ న్యూస్ బిల్డింగ్ పక్కన వీవీసీ పార్క్ వ్యూ కాంప్లెక్స్‌లో గల డాక్టర్ జమునా పాయిస్ స్కిన్ ల్యాబ్‌కు ఈ నెల 23న పర్వీన్‌బేగం తన కూతురు తన్వీర్ తపస్సుం (21)ను పీల్ ట్రీట్‌మెంట్ కోసం తీసుకువచ్చింది. చికిత్సకు రూ 2.19 లక్షల ఖర్చు అవుతుందని ఆపరేషన్ హెడ్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.హర్షవర్ధిని చెప్పింది. దీంతో పర్వీన్ బేగం రూ.లక్ష చెల్లించి వెళ్లిపోయింది. సాయంత్రం 6 గంటలకు చికిత్స పూర్తయిన తర్వాత నిర్వాహకులు పర్వీన్‌బేగంకు ఫోన్ చేసి మిగిలిన రూ. 1.19 లక్షల బిల్లు చెల్లించాలని కోరారు. దీంతో దురుద్దేశపూర్వకంగా పర్వీన్‌బేగం క్లినిక్‌లో కంప్యూటర్లు, అద్దాలు ధ్వంసం చేసింది. అంతేగాకుండా అద్దం ముక్కను పట్టుకుని పొడిచేస్తానంటూ బెదిరించింది. డాక్టర్ హర్షవర్ధిని ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో తన కూతురు పెళ్లి ఉండడంతో పీల్ ట్రీట్‌మెంట్ చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీల్ చికిత్స అంటే..

కెమికల్ పీల్ ట్రీట్‌మెంట్ అనేది నాన్-ఇన్వాసివ్ ప్రక్రియ. ఇది చర్మం యొక్క దెబ్బతిన్న బయట పొరలను ఎక్స్‌పోలియేట్ చేసేందుకు, తొలగించేందుకు రసాయన ద్రావణాన్ని ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియ కొత్త చర్మ కణాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఫలితంగా మృదువైన, స్పష్టమైన, మరింత యవ్వనంగా కనిపిస్తారు.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషిచేయాలి



సికింద్రాబాద్ బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ తదితరులు

చిలకలగూడ: దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి కోరారు. సీతాఫల్‌మండి మధురానగర్‌లోని సికింద్రాబాద్ బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రగతి ప్రస్థానంపై చెరగని ముద్రవేసిన రాజనీతజ్ఞుడు వాజ్‌పేయి అన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, అనిత, కన్నాభిరామ్, ప్రకాశ్‌గౌడ్‌లతోపాటు డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

◆ మెట్టుగూడలో రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు శారదమల్లేష్, మహేష్, రవీందర్, గంగాధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

బన్సీలాల్‌పేట్: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను బుధవారం సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్.. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ నాయకులు చీర శ్రీకాంత్, నాయకులు ఆకుల ప్రతాప్, ఆనంద్ వ్యాస్, నరేష్, స్వప్న, సందీప్, శ్రీనివాస్‌యాదవ్, వేణుగోపాల్, నరేంద్రపాల్, కిరణ్, రఘు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్: వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను వారాసిగూడ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం, రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశయాలను కొనియాడుతూ యువత ఆయన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, నేతి సత్యనారాయణ, దత్తు, దేశబోయిన రఘు పాల్గొన్నారు.



వారాసిగూడ చౌరస్తాలో..